క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న సందీప్‌రావు

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. రైతులు తమ వ్యవసాయ గట్లపై మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

గంగనాల కాలువలో పిచ్చిమొక్కలు తొలగింపు



కాల్వలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న జేసీబీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామశివారులో గోదావరి నదిపై ఉన్న గంగనాల మాటుకాలువ నీటి విడుదల కోసం వీడీసీ సభ్యులు సమావేశమయ్యారు. కాలువలో ఉన్న పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంతో వీడీసీ సభ్యులు రూ. 30 వేలు వెచ్చించి కాలువలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించుకున్నట్లు తెలిపారు. దీంతో పలు గ్రామాల్లో 4 వేల ఎకరాలకు నీరందుతుందని వీడీసీ చైర్మన్ గుమ్మల గంగన్న తెలిపారు.

అంగన్‌వాడీలకు అదనపు బాధ్యతలు కేటాయించొద్దు



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్లకు అదనపు బాధ్యతలు కేటాయించొద్దని శనివారం తహసీల్దార్ రమేశ్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ బడిబాటతో కేంద్రాల్లో చిన్నారుల ప్రవేశాలు పెరిగాయని, కేంద్రాల నిర్వహణకే పూర్తి సమయం వెచ్చించాల్సి వస్తోందన్నారు.అదనపు బాధ్యతలతో చిన్నారులకు ఆటపాటలతో బోధించలేకపోతున్నామని, కేంద్రాల నిర్వహణపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శ్యామల, సభ్యులు సంధ్యారాణి, రజిత, స్వరూప, లావణ్య, రాదాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మెట్‌పల్లి: పట్టణ సిల్వర్ జ్యువెల్లరీ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం రాత్రి సంఘ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా తోగిటి రమేశ్, ఉపాధ్యక్షుడిగా బెజ్జారపు రఘునాథ్, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి తిరుమలాచారి, కోశాధికారిగా తునికి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా వేములవాడ రాజశేఖర్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ మనోహర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జగిత్యాలఅగ్రికల్చర్: అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సహకార శాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి. చైతన్య అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాల అనే పాత్రపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు సాయికిరణ్, గాజెంగి వేణు, రాజు, నవీన్, మల్లేశ్, సుమన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

కోరుట్ల రూరల్: కోరుట్ల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన చిరంజీవిని మండల కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మహిపాల్ రెడ్డి, భూమయ్య,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో రోడ్లు ధ్వంసం

- అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలు
- ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్లు తరలింపు
- పట్టించుకోని అధికారులు



లారీలో తరలుతున్న గ్రానైట్

పెగడపల్లి: రోడ్డెక్కిన వాహనదారులు నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అంటూ పోలీసులు, రవాణా అధికారులు ఓ కన్నేసి ఉంచుతారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటారు. కానీ మండలంలోని ఓ క్వారీ వాహనాల విషయంలో మాత్రం ఉదాసీన వైఖరీ అవలంభిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ వాహనాలు అధిక లోడుతో వెళ్తున్నా... ఆపేదెవరు అన్న రీతిలో భారీ వాహనాలు పెగడపల్లి రహదారిపై పరుగులు తీస్తున్నా.. పట్టించుకున్న వారు లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామ శివారులోని గ్రానైట్ క్వారీ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. భారీ గ్రానైట్ రాళ్లను పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా లారీల్లో కరీంనగర్ వైపు తరలిస్తుంటారు. రెండు మూడురోజులకో రెండు మూడు లారీల చొప్పున క్వారీ వాహనాలు పరిమితికి మించిన లోడుతో రోడ్డుపై రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. రహదారి కూడా అక్కడక్కడ పాడై పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వీటిని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ రహదారుల సామర్థ్యం 20 టన్నులు కాగా, 40 నుంచి 50 టన్నుల లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 12 చక్రాల లారీ నిబంధనల ప్రకారం 20 టన్నులు, 10 చక్రాల లారీ 16 టన్నుల సామర్థ్యం వరకు రవాణా చేయొచ్చు. కానీ వాహనదారులు మాత్రం నిబంధనల పాటించకుండా పరిమితికి మించి తీసుకెళ్తున్నారు. అంతే కాకుండా గ్రానైట్ తరలిస్తున్న ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండానే తరలిస్తుండటంతో వీటివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగునోనని ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అధికలోడుతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నాం. వాహనదారులకు వాహన నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. వాహన నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి, నిబంధనలు ఉల్లఘించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. వాహనదారులు నిబంధనలు పాటించాలి.

కిరణ్‌కుమార్ ఎస్సై పెగడపల్లి



సాక్షి స్పందన

కొత్త స్తంభం ఏర్పాటు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామశివారులో వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది శనివారం బిగించారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 5న 'పగిలిన విద్యుత్ స్తంభం' అనే వార్త ప్రచురితమైంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పగిలిన విద్యుత్ స్తంభానికి ప్రక్కన కొత్త స్తంభం ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో కోరుట్ల ఏడీఈ రఘుపతి, ఏఈ దివాకర్‌రావు, సబ్ ఇంజినీర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన 8 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీలో కళాశాలలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సరితదేవి తెలిపారు.

మల్లాపూర్: బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాలలో మల్లాపూర్ మండల కేంద్రం మోడల్ స్కూల్‌తో పాటు వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. మల్లాపూర్ మోడల్ స్కూల్‌కి చెందిన విద్యార్థిని మధురిమ, వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సంజన, మణికంఠ, గీతిక, సౌమ్యలు ఎంపికయ్యారని శనివారం ఎంఈవో దామోదర్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్, వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం దత్తాద్రి తెలిపారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన పెగ్గెర్ల సునందిక, ముత్యాల రిషిక, కడార్ల వైష్ణవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కొల్లూరి సంతోష్ శనివారం తెలిపారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దమ్మ సింధూ, కథలాపూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన కొడిపెల్లి ప్రసన్న ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్ఎంలు రవీందర్, అనిత శనివారం తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన మొగిలి హేమశ్రీ అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నల్ల రాజయ్య శనివారం తెలిపారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. బీర్‌పూర్ ఉన్నత పాఠశాల నుంచి కె. అమూల్య, ఎస్. అశ్విత, ఎం శ్రీహిత ముగ్గురు విద్యార్థులు, తుంగూర్ ఉన్నత పాఠశాల నుంచి హర్ష, సువిష్ణరాణి బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. నర్సింహులపల్లె ఉన్నత పాఠశాల నుంచి జాహ్నవి మహబూబ్‌నగర్‌లోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంఈవో సిరుప నాగభూషణం, హెచ్ఎంలు నర్సింహ్మమూర్తి, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్‌లో చదువుతున్న అయిండ్ల అమూల్య, పత్తిరెడ్డి హరిణి అనే విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ శనివారం తెలిపారు. సీటు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్

జగిత్యాల: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం అందిస్తేనే అది నిజమైన విద్య అని గీత విద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ చింత రమేశ్ అన్నారు. సరస్వతీ విద్యా పీఠం అనుబంధ గీత విద్యాలయం పాఠశాల 1995–96 పదో తరగతి విద్యార్థులు రూ.లక్ష విలువ గల డెస్కులను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎన్నమనేని అశోక్ రావు, కమలాకర్‌రావు, లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు, సవరణలో బీఎల్వోలే కీలకం



మాట్లాడుతున్న కోరుట్ల ఆర్డీవో జివాకర్

మల్లాపూర్: నూతన ఓటర్ నమోదు, కార్డుల్లో తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలలో బీఎల్వోల పాత్రే కీలకమని కోరుట్ల ఆర్డీవో జివాకర్ అన్నారు. శనివారం మల్లాపూర్ రైతువేదికలో నిర్వహించిన బీఎల్వోల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలవ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్లుగా నమోదు చేయించాలని, ఓటర్ నమోదు, సవరణలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కా ప్రణాళికతో బీఎల్వోలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. శిక్షణ తరగతుల్లో తహసీల్దార్ రమేశ్‌గౌడ్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్, మాస్టర్ ట్రైనర్స్, బీఎల్వోలు పాల్గొన్నారు.

సామాజికాభివృద్ధికి సాహిత్యం దోహదపడుతుంది



సాహితివేత్తను సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్: సామాజికాభివృద్ధికి సాహిత్యం దోహదపడుతుందని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో ప్రముఖ సాహితివేత్త శ్రీపెరంబదూరి లింబగిరిని తహసీల్దార్ రమేశ్ గౌడ్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొగిలిపేట బిడ్డ లింబగిరి సన్మానించుకోవడమంటే సమాజాన్ని గౌరవించుకున్నట్లేనన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో పీఠాధిపతులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం పీఠాధిపతులు స్వామివార్లను దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి (తోగూట) స్వామీజీ, మదుసుధనానందా మహాస్వాముల వారు స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం ఆధ్వర్యంలో ఈవో శ్రీనివాస్ పీఠాధిపతులకు మేళతాళాలు, పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్ పీఠాధిపతులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

రాయికల్: ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా జ్యూట్ బ్యాగుల పంపిణీ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, రైతు దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రైతులను సన్మానించారు. అనంతరం భిక్షాటన చేసే వారికి అల్పాహారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్, సెక్రటరీ బోడుగం అంజిరెడ్డి, కోశాధికారి తిరుపతి, సభ్యులు ఉపాధ్యక్షులు వాసం స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ షూస్ అందజేత

రాయికల్: మండలంలోని ఆలూరులో పారిశుధ్య కార్మికులకు రెండు జతల సేఫ్టీ షూస్‌ను రైతు సేవా కేంద్రం సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్, అజయ్, రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమ్యకృష్ణ, నాయకులు లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి లబ్ధిదారులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి పాల్గొన్నారు.

రైతులకు అనుమతి లేకుండా పెస్టీసైడ్స్ విక్రయిస్తే చర్యలు

మల్లాపూర్: రైతులకు అనుమతి లేకుండా పెస్టీసైడ్స్‌ను ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి లావణ్య హెచ్చరించారు. శనివారం మల్లాపూర్, సిరిపూర్ గ్రామాల్లో సహకార సంఘం, ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆమె తనిఖీ చేశారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్లు ఎరువులను ఈ–పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరుపాలన్నారు. ఆమె వెంట ఏఈవోలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కార్పస్ ఫండ్

మేడిపల్లి: మేడిపల్లి మండల కేంద్రానికి మంజూరైన జూనియర్ కాలేజీ అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ భీమారం మండల అధ్యక్షుడు, తెలంగాణ ఎన్ఆర్ఐ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి రూ.50 వేలు, ఇంతకు ముందు బొంగోని రాజగౌడ్ లక్ష రూపాయలు, చేపూరి నాగరాజు లక్ష రూపాయలు కాలేజీ అభివృద్ధి కోసం కార్పస్ ఫండ్ అందజేశారు. కార్యక్రమంలో కాలేజ్ అభివృద్ధి చైర్మన్ మార్గం నర్సారెడ్డి, వెస్ చైర్మన్ పుల్లూరి దేవయ్య, మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, కాలేజ్ కమిటీ సభ్యులు అంగడి ఆనందం, చేపూరి నాగరాజు, బొంగోని రాజగౌడ్, ఎడమల రాజేందర్ రెడ్డి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

కోరుట్ల: పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న రోడ్డు పనులను కమిషనర్ రవీందర్ గౌడ్ శనివారం పరిశీలించారు. 23వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లలో క్లోరినేషన్ లెవల్స్ పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. తడి పొడి చెత్త , హానికర చెత్తపై అవగాహన కల్పించారు. తడిపొడి చెత్త వేరు చేసి బండికి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఈ సురేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు నిబంధనలు పాటించకుంటే చర్యలు

మెట్‌పల్లి: ఆర్ఎంపీలు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ఆర్ఎంపీ కేంద్రాల్లో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బోర్డులపై క్లినిక్‌లని పేర్కొనవద్దని, కేవలం ప్రథమ చికిత్స కేంద్రమని మాత్రమే ఉండాలన్నారు. అలాగే అధిక మోతాదులో మందులను రాయడం, అవసరం లేకపోయినా యాంటిబైటిక్స్‌ను వాడాలని సూచించడం చేయవద్దన్నారు. పరిధిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అందజేత

మల్యాల: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చి తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్న భక్తుడికి ఏఎస్సై శ్రీనివాస్ సెల్‌ఫోన్ వెతికి బాధితుడికి అప్పగించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎడవెల్లి శ్రీకాంత్ శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకోవటానికి వచ్చి, తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఏఎస్సై దృష్టికి తీసుకెళ్లగా వెతికి, సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగించారు. ఏఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.



అలరించిన స్వాగతోత్సవం

కోరుట్ల: పట్టణంలోని మాస్టో జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు మహదేవ్, బారి, సత్యనారాయణ, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



ముత్యంపేటలో మొక్కలు నాటుతున్న అధికారులు

మల్యాల: వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని జిల్లా డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో శనివారం ఎంపీడీవో స్వాతితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేసి, మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్, ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం రాజయ్య, టీఏ జలపతి రెడ్డి, లావణ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం పరిశీలన

మండల కేంద్రంలోని శ్రీ ధరణి ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని డీఆర్డీఏ పీడీ రఘువరన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువుల నిల్వ రిజిస్టర్‌తోపాటు, ఎరువుల వివరాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో శ్రీధర్, ఏపీఎం రాజయ్య, ఫార్మ్ ఏపీఎం హుస్సేన్, ఏపీఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీఏ పీడీ

మల్యాల: మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీఏ పీడీ రఘువరన్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారిగా నియామకమైన సందర్భంగా శనివారం మల్యాల మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వాతి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వాతి, కార్యాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ టీఏలు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్స్ యూనియన్ మండలాధ్యక్షుడిగా అశోక్

కథలాపూర్: మండల ఫొటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కథలాపూర్‌కు చెందిన చిలుక అశోక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గంగుల శ్రీనివాస్, కోశాధికారిగా మచ్చ శేఖర్ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గసభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

గొల్లపల్లి: కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం,సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని కాంగ్రెస్ చేసిన దేశద్రోహపు చర్యలను ప్రజలకు తెలియజేస్తామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. గొల్లపెల్లిలో శనివారం మాట్లాడుతూ నీచమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీని విమర్శించడం మానుకొని దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెవులమద్ది శేఖర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యానికి గురికావడంతో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఈ ప్రాంత రాజకీయాలపై చర్చించామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: అపోలో రిచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్జీరామ్ హెల్త్‌కేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సాగర్‌రావు అన్నారు. శనివారం ఎమ్మెల్సీ ఎల్.రమణ స్వగృహంలో వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎల్జీరామ్ హెల్త్‌కేర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 8న వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గట్టు సతీశ్, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి శివారు గ్రామం నాయికపుగూడెం గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన కండ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి రాజన్న గిరిజన సంక్షేమం , పంచాయతీరాజ్ శాఖ సీతక్కకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఇళ్ల మంజూరుపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మంత్రి ఆదేశించారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

రాయికల్: పర్యావరణం కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని అల్లీపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజలింగం అన్నారు. శనివారం అల్లీపూర్ సొసైటీ పరిధిలో ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో–ఆపరేటీవ్ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఈవో ఉపేందర్‌రావు, పాలకవర్గ సభ్యులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పవిత్రమైన అషురాఖానాలు, బందీలతో ఊరేగింపులు చేపట్టారు. ఉదయం నుంచి ముస్లింలతో పాటు హిందూ సోదరులు కూడా ఉత్సవాల్లో పాల్గొని సామరస్యాన్ని చాటారు. పులి వేషాలు ఆకర్షణగా నిలిచాయి.

ధర్మపురి: ధర్మపురిలో జరిగిన వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పీరీలకు మొక్కులు చెల్లించుకున్నారు.

కథలాపూర్: మొహర్రం వేడుకల్లో భాగంగా కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి పీరీలను ఊరేగించారు. పీరీల ఎదుట ఉన్న అగ్నిగుండాల వద్ద అసైదులా ఆటలు ఆడారు. అనంతరం పీరీలను గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఊరేగించారు.

బోనాల పండుగ ప్రీతికరమైనది

జగిత్యాల: బోనాల పండగ అత్యంత ప్రీతికరమైనదని అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్ఫోర్స్ పాఠశాలలో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆషాడమాసం బోనాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.